www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024
5
చిత్తూరు



ఉపాధ్యాయుల ఔన్నత్యాన్ని పెంపొందించాలి

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయుల ఔన్నత్యాన్ని పెంచే విధంగా ప్రభుత్వ పోకడలు ఉండాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐరాల, నాంపల్లి గౌరీ శంకర కళ్యాణ మండపంలో యుటిఎఫ్ చిత్తూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం సోమశేఖర నాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించే విధంగా, ఇచ్చిన మాట ప్రకారం 117 జీవోను రద్దు చేస్తూ పాఠశాల విలీన ప్రక్రియను రద్దు చేయాలని, సిపిఎస్ రద్దు హామీని నిలబెట్టు కోవాలని అధికారం చేపట్టనున్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన బోధన కలిగించే విధంగా ఉపాధ్యాయులకు అవకాశం ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లాలని, మేధావులు, విద్యా రంగ శ్రేయోభిలాషుల అభిప్రాయాలను పరిగణలో తీసుకుని ముందుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం సోమశేఖర్ నాయుడు, ఎన్. మణి గండన్, జిల్లా గౌరవ అధ్యక్షులు పి సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు పి ఆర్ మునిరత్నం, రెహానా బేగం, కోశాధికారి కె ప్రసన్న కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.దీనావతి, సిపి ప్రకాష్, ఎస్ పి బాషా, మాజీ గౌరవ అధ్యక్షులు జి.రాధా కృష్ణ, జిల్లా కార్యదర్శులు ఎ.కృష్ణమూర్తి, కె.రెడ్డెప్ప నాయుడు, డి ఏకాంబరం, గాలి సురేష్, టి.దక్షిణామూర్తి, కె. సరిత, జిల్లా నలుమూలల నుండి అన్ని మండలాలు అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కౌన్సిలర్లు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు



గుట్ట పోరంబోకు భూమి అన్యాక్రాంతం

పట్టించుకోని రెవెన్యూ శాఖ

ప్రజాశక్తి -గుడిపల్లి: గుడిపల్లి మండలం నక్కనపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన సర్వే నంబర్ 62 గుట్ట పోరంబోకు భూమి అన్యాక్రాంతం అయిందని గుండ్ల సాగరం గ్రామ పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 ఎకరాల 20 సెంట్లు భూమిలో ఒక వైసిపి ప్రముఖ నాయకుడు ఇందులోని రెండు ఎకరాల్లో క్వారీ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని అయినా రెవెన్యూ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా పట్టించు కోవడం లేదని, మిగతా భూమిని గుండ్ల సాగరానికి చెందిన కొంత మంది ఆక్రమించుకున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. స్థానిక సర్పంచ్ నాగరాజు ఈ విషయం పలుమార్లు ఆ శాఖ అధికారులకు సమాచారం అందించినా పట్టించు కోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ సిబ్బంది నిద్రమత్తు వీడి ఈ సర్వే నంబర్‌లోని భూమిని పరి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: పలమనేరులో తెలుగు సాహిత్య, సాంస్కృతిక సేవా సమితి అధ్వర్యంలో కళాతరంగిణి సంస్థ ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవంలో బైరెడ్డి పల్లె చిన్నారులు ఉత్తమ కళా ప్రతిభ కనబరిచారు. శాస్త్రీయ, భక్తి, సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించిన చిన్నారులు లహరి, హిమనశ్రీ, మధుశ్రీ, పావని, చరిత, చిత్ర , అనుష్క , దర్శిని, చరణ్ సాయి, గగన్‌లను తెలుగు సాహిత్య , సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. చిన్నారులకు ఉత్తమ శిక్షణ అందించిన కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్ బాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పుష్ప , శ్రీపురం సీతారామయ్య , మాధవ రెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ ఆర్టిస్ట్ మస్తాన్ , గోపి, సోమశేఖర్ పాల్గొన్నారు.



కూటమి నాయకుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -సోమల: సార్వత్రిక ఎన్నికలలో కేంద్రంలో నరేం ద్ర మోడీ, రాష్ట్రంలో కూట మి అధికారంలోకి రావడం ప్రధానమంత్రిగా మూడవ సారి నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో సోమల మండలంలో కూట మి నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి సోమల బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గన్న మదన్మోహన్ బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సోమల నుండి కమ్మపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిత్యం ట్రాఫిక్ సమస్యలు

- సంతను దాటాలంటే గంట సమయం
- వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- స్పందించని పోలీసులు

ప్రజాశక్తి -శాంతిపురం: మండల కేంద్రానికి సమీపంలో ప్రతి ఆదివారం నిర్వహించే బడుగుమాకుల పల్లె సంతలో నిత్యం ట్రాఫిక్ జామ్ చోటు చేసుకుంటుంది. వారం వారం జరిగే ఈ పశువుల సంతను కుప్పం పలమనేరు జాతీయ రహదారికి ఇరువైపులా నిర్వహిస్తున్నారు. ఉదయం పూట ఎద్దులు, ఆవులు, గొర్రెలు, కోళ్లను విక్రయించడానికి రైతులు వాహనాల్లో తీసుకువస్తారు. ఈ సంతకు తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో వ్యాపారస్తులు వస్తుంటారు. సంతలో క్రయ విక్రయాలు నిర్వహించడానికి వచ్చే రైతులు, వ్యాపారస్తులు వాహనాలు అన్నిటిని రోడ్లపైనే అడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులకు, ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఆటంకం ఎదురవుతోంది. పశువుల సంతను రోడ్డుపై నిర్వహిస్తుండడంతో వాహనాలు కిలోమీటర్ల కొద్దీ రోడ్డుపై నిలిచిపోతున్నాయి. సంత నిర్వహించే ప్రాంతాన్ని దాటాలంటే కనీసం వాహనదారులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ప్రతివారం ట్రాఫిక్ జామ్ అవుతుంటే పోలీసులు కనీసం పట్టించు కోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకరి ఇద్దరు పోలీసు సిబ్బంది పశువులను తరలించే వాహనదారుల వద్ద మామూళ్లు వసూలు చేసు కుంటున్నారు. కానీ ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతలో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



సంత కారణంగా ఆగిపోయిన ట్రాఫిక్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి తెలిపారు. నైరుతి రుతు పవనాలతో జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పారిశుధ్యం దెబ్బతిని సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రజాశక్తి: ఇటీవల కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వైద్య ఆరోగ్య శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటోంది?

డిఎం అండ్ హెచ్‌ఓ: సహజంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వాతావరణం చల్లబడి తేమ కారణంగా దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్ , డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం అధికంగా ఉంటుంది.

ప్రజాశక్తి: డెంగ్యూ మలేరియా ఇతర సీజనల్ వ్యాధులను ఎలా గుర్తించాలి?

డిఎం అండ్ హెచ్‌ఓ: రెండు మూడు రోజులకు మించి జ్వరం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని వైద్యులను సంప్రదించి రక్త పరీక్ష చేయించుకోవాలి.

ప్రజాశక్తి: మలేరియా నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

డిఎం అండ్ హెచ్‌ఓ: జూన్ మాసం మలేరియా నివారణ మహోత్సవంగా ప్రభుత్వం ప్రకటిం చింది.. దోమల నివారణ కోసం చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు పారిశుధ్యం పై అవగాహన కల్పిస్తున్నాం..

ప్రజాశక్తి: ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ఎలా జరుగుతోంది?

డిఎం అండ్ హెచ్‌ఓ: ప్రతి శుక్రవారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఫ్రైడే ఫ్రైడే జరుగుతోంది. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పారిశుధ్యాన్ని తనిఖీ చేస్తూ నివాస ప్రాంతా ల్లో పూల కుండీలు, పాడైపో యిన పాత వస్తువుల్లో నీరు నిలువ ఉండకుండా అవగా హన కల్పిస్తున్నాం.


ఇంటర్వ్యూ

ప్రజాశక్తి: దోమల పెరుగు దలను ఎలా అరికట్టాలి?

డి ఎం అండ్ హెచ్ ఓ: ఇంటి చుట్టూ పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు, చెత్త కుండీలు, వర్షపు నీటి నిల్వల్లో దోమల వృద్ధి అధికంగా ఉంటుంది. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి, రాత్రుల్లో నిద్రించే సమయాల్లో దోమల పుట్టకుండా దోమతెరలు వాడడంతో పాటు ఇతర జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా దోమలు కుట్టడం వల్లనే వైరల్ ఫీవర్ వచ్చే అవకాశం ఉంది. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించడం ద్వారా మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవచ్చు.

– డాక్టర్ ఓ ప్రభావతి దేవి,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి





దళితుల సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

అన్నూరు ఈశ్వర్, కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి -గంగవరం: దళిత సమస్యల పరిష్కారం పట్ల పాలక వర్గాల దృష్టి లేని కారణంగా దళితుల సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకున్నాయని, మెజారిటీ ప్రజల ఓట్ల ద్వారా ఎన్నికైన నూతన ప్రభుత్వమైనా దళితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ కోరారు. ఆదివారం కెవిపియస్ గంగవరం మండల కమిటీ సమావేశం ఆ సంఘం మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. కెవిపిఎస్ మండల కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి అన్నూరు ఈశ్వర్, గౌరవ అధ్యక్షులు ఓబుల్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా కొలువు తీరబోతున్న రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు స్వాగతం తెలిపారు. గత పాలకుల విధానాల కారణంగానే వారు ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి వచ్చిందన్నారు. అందరికి పెన్షన్‌లు పెంచుతూ వచ్చిన గత ప్రభుత్వం డప్పు వృత్తి కళకు సంబంధించిన పెన్షన్‌ను మాత్రం పెంచలేదన్నారు. శ్మశానంలో గుంతలు తీసే వృత్తి దారులను, ఇప్పటికి వృత్తి దారులుగా గుర్తించలేదన్నారు. చర్మకారులకు ఇవ్వాల్సిన కిట్లు, వృత్తి కేంద్ర నిర్మాణం పట్ల ఎలాంటి చొరవ చూపలేదని, అందుకే సామాజిక తరగతుల ఆగ్రహానికి గురి కావలసి వచ్చిందన్నారు. కొత్త గా అధికారానికి రాబోతున్న నాయకులైనా ఈ సామాజిక అసమానతలను తొలగించి, దళిత వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలా జరగని పక్షంలో ఎదురైతే పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఐక్యత పోరాటం ద్వారా మన సమస్యలను పరిష్కరించుకునేందుకు సిద్ధం కావాలని వారు పిలుపు నిచ్చారు. ఈ సమావేశం లో కెవిపియస్ నాయకులు పదిహేను మంది నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న టిఎన్‌టియుసి నాయకులు

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: టిడిపి ఎమ్మెల్యే థామస్, పార్లమెం టు సభ్యుడు దగ్గుమళ్ల ప్రసా దరావు అత్యధిక మెజారి టీతో విజయం సాధించ డంతో గంగాధర నెల్లూ రు మండలం తూ గుండ్రం దళితవాడ చర్చి లో టిఎన్‌టియుసి అధికా ర ప్రతినిధి జీవరత్నం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంత రం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

ఘనంగా ద్రౌపది ధర్మరాజుల కళ్యాణం

ప్రజాశక్తి - ఎస్ ఆర్ పురం: ఎస్‌ఆర్ పురం ఆయకట్టు ఎస్‌ఆర్ పురం మహాభారతంలో శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజు ఆదివారం అత్యంత వైభవంగా కన్నుల పండుగగా ఆలయ అర్చకులు మంత్రోచ్ఛారణ మంగళ వాయిద్యాల మధ్య నిర్వహించారు. ద్రౌపది కళ్యాణానికి మాన్యం గీత సుబ్రహ్మణ్యం నాయుడు ఉభయదారులుగా వ్యవహరించి సంప్రదాయబద్ధంగా మాన్యం గీత సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు పీటలపై కూర్చుని దానం చేశారు. మంగళ వాయిద్యాలతో అమ్మవారిని తీసుకువచ్చి వివాహ వేదిక పురోహితుల వేదమంత్రాల మధ్య పెళ్లి తంతు ముగించారు. పరిసరాల ప్రాంతాల్లో గ్రామ ప్రజలు అమ్మవారికి అక్షింతలు వేశారు. చదివింపులు సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, నారాయణస్వామి నాయుడు, రాజశేఖర్ నాయుడు, సుదర్శన్ నాయుడు, మాధవ నాయుడు, బ్రహ్మనాయుడు, కేశవులు నాయుడు, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న జాఫర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో టిడిపి164 స్థానాల్లో ఘన విజయం సాధించడంతో పాటు చిత్తూరు నియోజక వర్గంలో గురజాల జగన్మోహన్ ఘన విజయం సాధించారు. టిడిపి అధికారంలోకి రావడం, చిత్తూరు ఎమ్మెల్యేగా గురజాల జగన్మోహన్ విజయం సాధించడంతో ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు జాఫర్ తమిళనాడులోని నాగూర్‌కు వెళ్లి గుండు కొట్టించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రావడం, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, చిత్తూరులో గురజాల జగన్మోహన్ విజయం సాధించాలని కోరుకున్నట్లు తెలిపారు. తన కోరిక నెరవేరడంతో నాగూరులో గుండు గీయించుకుని మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు. టిడిపి విజయానికి తనకు సహకారం అందించిన ముస్లిం మైనార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టుబడ్డ వాహనాలకు రేపు బహిరంగ వేలం

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈనెల 11వ తేదీ వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ టూ వీలర్స్ ఫోర్ వీలర్స్ ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబి ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సురేష్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనాలనుకున్న వారు ముందుగా వచ్చి ధరావత్తు సొమ్ము చెల్లించి రసీదు పొంది వేలంలో పాల్గొనాలని తెలిపారు.



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

అన్నదానం

ప్రజాశక్తి-గూడూరుటౌన్: గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదివారం చేడిమాల పంచాయతీ నల్లయ్యగారిపాలెంలో అభిమానులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నాగేశ్వరరావు, ప్రసన్నకుమార్‌లు దాతలుగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అందరికీ సుపరిచితులైన పాశం సునీల్ కుమార్ ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. వారు భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తా: ఆదిమూలం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం, బుచ్చినాయుడుకండ్రిగ: పార్టీ విజయానికి కష్టించి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ అండగా నిలుస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగ, కేవీబీపురం, వరదయ్యపాలెం మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయన్ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఆదిమూలం కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయానికి కృషి చేసిన ధన్యవాదాలు: గోపికృష్ణ

ప్రజాశక్తి-క్యాంపస్: నగరి ఎమ్మెల్యేగా గాలి భాను విజయానికి కృషి చేసినవారందరికీ తెలుగు యువత రాష్ట్ర నాయకులు శాఖమూరి గోపికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయన తిరుపతిలో మాట్లాడుతూ గాలి భానుకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



ఫోరం ఫర్ ఆర్టిఐ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలో రాయలసీమ జోన్ ఫోరం ఫర్ ఆర్టిఐ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ నూతన కార్యాలయాన్ని ఫోరం ఫర్ ఆర్.టి.ఐ నేషనల్ జాయింట్ సెక్రటరీ అజయ్ ప్రసన్నకుమార్ రాయల్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చంద్రకళారెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, సెక్రటరీ ప్రసాద్, అధికార ప్రతినిధి చంద్రశేఖర్, తిరుమల టౌన్ అధ్యక్షులు ఆవుల సుబ్బు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ తదితరులు కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ శాఖల నుండి కోరిన సమాచారాన్ని అవసరమైన వ్యక్తులకు ఇప్పించడానికి ఆర్టిఐ చట్టం ద్వారా తగిన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, రాయలసీమ జోన్ పరిధిలో తిరుపతి ప్రధాన కేంద్రంగా నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి -కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్‌కెవీబీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 సంవత్సరాల క్రితం 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు సతీష్‌బాబు, షఫీ, పాఠశాల హెచ్‌ఎం అరుణలకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. 25 సంవత్సరాల అనంతరం విద్యనభ్యసించిన పాఠశాల ఆవరణలో కుటుంబ సభ్యులతో పాటు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. అప్పటిలో వారు చేసిన చిలిపి చేష్టలను గుర్తుంచుకుని, ఉపాధ్యాయులు కొట్టిన దెబ్బలు, తరగతి గదిలో తోటి విద్యార్థులతో కలసి చేసి అల్లర్లను గుర్తు చేసుకుని పాఠశాల ఆవరణలో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతూ వారి కుటుంబ సభ్యులను, స్నేహితులకు పరిచయం చేసుకున్నారు. 'ఎక్కడున్నావు..? ఏం చేస్తున్నావు..? భార్యపిల్లలు బాగున్నారా..?' అంటూ కుశల ప్రశ్నలతో, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చలపతిరావు, పుణ్యకోటి, దినకర్, గంగాధర్, విజయ్, యుగంధర్, జయప్రకాష్, శేఖర్, కోమల, మోహనాంబ, ఉష, చంద్ర, సుజాతలు పలువురు పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆకట్టుకున్నఉత్తర గోగ్రహణం

ప్రజాశక్తి -సోమ ల: మం డల కేంద్రమైన సోమల పంచా యతీ భారతం మిట్టలో నిర్వహిస్తున్న మహా భారత యజ్ఞంలో ఆదివా రం ఉత్తర గోగ్రహణం నాటక కళాకా రులు, ప్రజలు నిర్వహిం చారు. మహా భారత కథలో యుద్ధ ఘంటికలు మోగే ముందు ఉత్తర కుమారుడు బృహన్నల యుద్ధభూమిలో జమ్మి చెట్టు పైనున్న ఆయుధాలను తీసుకునే సందర్భంగా నిర్వహించే ఘట్టం కావడంతో వందలాది మంది ప్రజలు తిలకించడానికి మహాభారత యజ్ఞం ప్రాంగణానికి చేరుకున్నారు. దుర్యోధన వేషధారి, అర్జున వేషధారి, ఉత్తర కుమార వేషధారులు పద్యాలు పాడుతూ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రజలు ఆశాంతం తిలకించారు. చాందిని బండిపై అర్జునుడు, ఉత్తర కుమారుడు యుద్ధభూమికి వచ్చే ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.



ఉత్తర గో గ్రహణం ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

అలరించిన దుర్యోధన వధ

ప్రజాశక్తి - కార్వేటినగరం: కొల్లాగుంటలో వెలసిన శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి ఉషారాణి హరికథా కాలక్షేపాన్ని కన్నులకు కట్టినట్లు ఆలపించారు. మధ్యాహ్నం శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుని భీమసేనుడు గంగ మడుగు నుండి తీసుకొచ్చే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకొంది. దుర్యోధన పాత్రదారుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడిపెట్టించింది. దుర్యోధన పద ఘట్టానికి కొల్లాగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పట్నం కాంతమ్మ, ఆర్ముగంరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జ్యోతి ఉభయదారులుగా వ్యవహరించారు. వార్షిక మహా భారత బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. కంకణాలు ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు వస్త్రాలు ధరించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. మహిళలు ఆలయంలో మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమానికి శాంతి తులసీ రామ్ కుటుంబ సభ్యులు ఉదయ దారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, కమిటీ మెంబర్లు, గ్రామస్తులు, భక్తులు పలువురు పాల్గొన్నారు. కొల్లాగుంట గ్రామానికి చెందిన దొరస్వామిరెడ్డి, ధనమ్మ ఆధ్వర్యంలో బాణసంచా వేడుకలను ఘనంగా నిర్వహించారు.



దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకిస్తున్న ప్రజలు

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ నందిమంగళం గ్రామంలో గత నాలుగు రోజులుగా వాంతులు, విరోచనాలతో హాస్పిటల్లో చికిత్స పొందుతూ నందిమంగళం గ్రామానికి చెందిన భాస్కర్, శోభ, భవ్య(12) గత నాలుగు రోజుల క్రితం పుత్తూరు ప్రభుత్వ ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొంది మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా హాస్పిటల్‌కి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఇంకా చాలామంది నగిరిలోను, పుత్తూరులోనూ తిరుపతిలోనూ చికిత్స పొందుతున్నారు. ఇందుకోసం పలుసార్లు అధికారులకు సిఐటియు నాయకులు వెంకటేష్ ఫిర్యాదు చేశారు. వారికి దగ్గరుండి వైద్య పరీక్షలు కోసం తీసుకెళ్లి, జిల్లా వైద్య అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి వారిని గ్రామాల్లోకి వచ్చి పరిశీలించి వారికి కావలసిన అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపల్ అధికారులు తాగునీటి పైప్ లైన్ తొలగించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సిఐటియు నాయకులు వెంకటేష్ తెలిపారు.



చికిత్స పొందుతూ మృతి చెందిన చిన్నారి

విద్యుత్ తీగలు తెగిపడి గొర్రె మృతి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పురపాలక పరిధిలోని పోటిపాలెం వద్దనున్న లెమన్ సిటీ లేఔట్‌లో విద్యుత్ తెగిపడి ఆదివారం గొర్రె మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు పోటు పాలెంకి చెందిన నరేష్ అనే వ్యక్తి గొర్రెలను మేపుతుంటారు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తెగి పడి గొర్రె మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.7వేలు ఉంటుందన్నారు. విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ ద్వారా పలుమార్లు స్థానికులు తెలియజేసేందుకు ప్రయత్నించగా ఇప్పటివరకు సంబంధిత అధికారి స్పందించలేదున్నారు. ఒకవేళ మనుషులే ఉంటే పరిస్థితి ఏందని విద్యుత్ శాఖపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్కో అధికారులు స్పందించి తెగిపోయిన విద్యుత్ తీగలను పునరుద్ధరించి, మూగజీవాలు, ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుకుంటున్నారు.



ఎంవీ యాక్టును రద్దు చేయాలి: సీఐటీయూ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: 2019లో అమలు చేసిన ఎంవీ యాక్టును రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో పుత్తూరు లారీ డ్రైవర్స్ యూనియన్ సమావేశం ప్రశాంత్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత డ్రైవర్లకు ఉరితాడైన మోటర్ వెహికల్ చట్టాన్ని సవరించి, 2019మోటరు వెహికల్ చట్టాన్ని తీసుకొచ్చి డ్రైవర్ల జీవితాలతో చలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సవరణ చేసిన మోటర్లు వెహికల్ చట్టాన్ని రద్దుచేసి డ్రైవర్‌లను ఆదుకోవాలని కోరారు. కొత్తగా వచ్చే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డ్రైవర్ల పైన ఒత్తిడి లేకుండా వారికి రక్షణ కల్పించాలని వారి కుటుంబం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లకు 2019 మోటార్ వెహికల్ చట్టాన్ని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి డ్రైవర్లకు అండగా నిలబడాలని అదేవిధంగా పెట్రోల్ డీజిల్ ధరలను జిఎస్టి పరిధిలోకి చేర్చాలని అన్నారు డ్రైవర్ల అందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పుత్తూరు డ్రైవర్ యూనియన్ నాయకులు ప్రశాంత్, కృష్ణయ్య, శివశంకర్ ప్రసాద్, మనోహర్, వేలు, అశోక్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం

వెంకటగిరిలో దారుణం

- ఓ రెస్టారెంట్ వద్ద వ్యక్తి హత్య
- దర్యాప్తు చేస్తున్న డిఎస్పి

ప్రజాశక్తి - వెంకటగిరి: చిన్నపాటి స్వల్పవివాదంలో ఒకరి నిండి ప్రాణం బలైంది. మద్యం దుకాణం వద్దకు వచ్చిన వ్యక్తిపై కత్తిలో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశారు. ఈ ఘటన వెంకటగిరి పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో ఉన్న ఓ రెస్టారెంట్ బార్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. సీఐ సంగమేశ్వరరావు కథనం మేరకు పట్టణంలోని బీసీకాలనీ బొప్పాపురంకు చెందిన బొక్కసం విజయ్(35) భార్య మునెమ్మలు తిరుపతి కరకంబాడి సమీపంలో ఉన్న ఓ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో బీసీకాలని తన స్వంత నివాసంకు చేరుకున్నారు. ఇక్కడ నుంచి కంపెనీకి విధులు కొనసాగిస్తున్నారు. ఆదివారం బొక్కం విజయ్ పాలకేంద్రం సెంటర్ 32 కేవీ సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ శ్రీకాళహస్తి మండలం వెల్లంపల్లికి గ్రామానికి చెందిన నరసింహా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో విజయ్, నరసింహులు ఆదివారం బార్ అండ్ రెస్టారెంట్ వద్ద స్వల్ప వివాదం చోటుచేసుకోని మాట మాట పెరిగింది. దీంతో క్షణికావేశంకు గురైన నరసింహులు పక్కనే ఉన్న కత్తితో విజయ్ దాడి చేసి పరారయ్యాడు. రక్తపు గాయాలైన విజయ్ సమీపంలో జియో పెట్రోల్బంక్ ఆవరణంలో ఆపస్మరక స్థితిలో పడిపోయారు. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించి విజయ్ మార్గ మధ్యం లో మృతి చెందారు. ఈ ఘటన తెలుసుకున్న గూడూరు డీఎస్పి సూర్యనారాయణ, సీఐ సంగ మేశ్వర రావు, ఎస్ఐలు ఘటన స్థలం వద్దకు చేరుకొని స్థానికుల వివరాల మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

క్రైం న్యూస్

ఆగి ఉన్న కారును ఢీకొన్న ఈచర్

- బాలుడు మృతి - భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: ఆగి ఉన్న కారును ఈచర్ ఢీకొన్న ప్రమాదంలో బాలుడు మృతి చెందగా, భార్యా భర్తలు గాయపడిన సంఘటన బంగారుపాళెం మండలంలో ఆదివా రం చోటు చేసు కుంది. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుండి దీపక్ శివకుమార్ చెల్లెల కుమారుడు లోకేష్ ముగ్గురు తిరుమలకు వెళు తుండగా మార్గ మధ్యంలో కేజీ సత్రం వద్ద కారు ఆపారు. విశ్రాంతి తీసుకుంటుండగా కోలారు నుండి మద్రాస్‌కి వెళుతున్న ఈచర్ డ్రైవర్ అజాగ్రత్త కారణంగా కారు వెనక ఢీకొంది. ఈ ప్రమాదంలో శివకుమార్ చెల్లెల కొడుకు లోకేష్ (13) సంఘటన స్థలంలోనే అక్కడికక్కడే మృతి చెందాడు. దీపక్ శివకుమార్‌కు గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేపట్టారు. డ్రైవరు అజాగ్రత్త వల్ల ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన బాలుడు లోకేష్



రామోజీరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

రామోజీరావుకు నివాళి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: అక్షర యోధు డు, ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావుకు మండలంలోని తూగుండ్రం గ్రామంలో పలువురు టిడిపి నాయ కులు బస్టాండు కూడలి వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్, నాయకులు శ్రీనివాసులు శెట్టి, రాఘవేంద్ర, సంపత్, దినేష్, కమల్, విమల్ పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కంటి ఆపరేషన్లకు 38 మంది ఎంపిక

ప్రజాశక్తి -భైరెడ్డిపల్లి: చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వ హించిన ఉచిత కంటి చికిత్స శిబిరానికి 79 మంది హాజరు కాగా వారిలో 38 మంది ఆపరేషన్లకు ఎంపిక అయ్యారు. డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డాక్టర్ మురళీకృష్ణ వైద్య పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్ 38 మందిని ఎంపిక చేశారు. వారిని చెన్నై శంకర్ నేత్రాలయ హాస్పిటల్‌కు తరలించి ఆపరేషన్ చేయించి వారి ఇంటి వద్దకు చేర్చే వరకు ట్రస్ట్ వారు ఖర్చులు భరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయ డాక్టరు మురళి కృష్ణ, డాక్ట రు శ్రీనివాసులు, చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.



ఎన్టీఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న గురజాల జగన్మోహన్

ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించిన గురజాల

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆదివారం ఎన్‌టి ఆర్ ఘాట్‌ను సందర్శించి నంద మూరి తారక రామారా వుకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ , చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి పరిశీలకులు పల్లెంటి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సేవా భావంతోనే గుర్తింపు: శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సేవా భావం కలిగి ఉండడం వల్లే తగిన గుర్తింపు వస్తుందని, డాక్టర్ రవిరాజుకు అనేక గుర్తింపులు పొందారని వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షులు కేఎల్ మూర్తి, ఆర్ మాధవనాయుడు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక వర్కర్స్ భవనములో సమావేశం నిర్వహించి సన్మాన గ్రహీత డాక్టర్ రవి రాజును ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ముని కృష్ణయ్య, గుణశేఖర్ రెడ్డి, ఉషోదయ వాకర్స్ అధ్యక్షులు కోనేటి రవిరాజు, గోపికృష్ణ, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

తుడా ఛైర్మన్ పదవికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రాజీనామా

ప్రజాశక్తి -రామచంద్రాపురం: తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. శనివారం తుమ్మలగుంట లోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తన పదవికి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలలో తనకు ఓటు వేసిన లక్ష మంది ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తుడా ఛైర్మన్ గా, తిరుపతి రూరల్ ఎంపీపీగా చంద్రగిరి నియోజకవర్గంలో 950 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసామన్నారు. సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. చంద్రగిరిలో టిడిపి నాయకులు, ప్రత్యర్థి పార్టీ వైసిపి నాయకులపై దాడులు చేయడాన్ని ఆయన ఖండించారు. చంద్రగిరి ప్రజల తీర్పును శిరసా వహిస్తానని పేర్కొన్నారు.

ఘనంగా ముద్దుకృష్ణమనాయుడు జయంతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు 77వ జయంతి వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుత్తూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో ముద్దుకృష్ణమనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ముద్దుకృష్ణమనాయుడు హయాంలో ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, షణ్ముగం రెడ్డి, గోపీనాథ్, మహేష్, బాబు నాయుడు పాల్గొన్నారు. అదేవిధంగా టీడీపీ పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో తొర్రూరు గ్రామంలో ముద్దుకృష్ణమనాయుడు జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవికుమార్, బాలాజీ, అభిమానులు పాల్గొన్నారు.